ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 27 జూలై 2024





ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో నామినేటెడ్ పదవుల జాతర మొదలైంది. నిన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి జనం అనూహ్యరీతిలో జైకొట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని బలపరిచారు. ఐదేళ్ల వైసీపీ దాష్టీకాన్ని పెకలించేసి గంగలో కలిపేశారు. 164 అసెంబ్లీ స్థానాలను కూటమికి కట్టబెట్టి జనం వైసీపీ పట్ల ఉన్న కసిని చల్లార్చుకున్నారు. సీఎం సొంత గడ్డ కడప ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఏడుస్థానాలను గెలుచుకుంది. జగన్ సొంత జిల్లాలో టీడీపీ, బీజేపీ, జనసేన సత్తా ఏంటో చాటారు. జమ్మలమడుగులో బీజేపీ, రైల్వేకోడూరులో జనసేన గెలిచాయి. కడప, మైదుకూరు, కమలాపురం, ప్రొద్దుటూరు, రాయచోటిలో టీడీపీ వారే గెలిచారు. వైసీపీ కేవలం మూడు స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనుండటంతో కూటమి గెలుపుకోసం విశేషంగా కృషిచేసిన కార్యకర్తలంతా ఆశలు పెట్టుకున్నారు.


నామినేటెడ్ జాతర

- పార్టీల కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు..
- నామినేటెడ్ పదవుల్లో చోటు దక్కేనా
- పదవుల్లో టీడీపీ, జనసేన, బీజేపీలకు భాగస్వామ్యం
- ఎమ్మెల్యేలు, నేతల సిఫారసులైతే..
- కొందరు కార్యకర్తలకు పదవులు అనుమానమే
- పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తించి పదవులిస్తేనే న్యాయం

(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి నెలన్నర దాటింది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు కూటమి చర్యలు చేపట్టింది. ఇప్పటికే కేడరు వివరాలను సేకరిస్తున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో కడప జిల్లాలో టీడీపీ కేడర్ కుదేలైంది. చంద్రబాబు అరెస్టుతో టీడీపీ శ్రేణుల్లో కసి వచ్చింది. చంద్రబాబు రిలీజ్ అయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో రోజూ నిరసనలు తెలిపారు. కడప నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి ఆధ్వర్యంలో దీక్షలు చేస్తూ వచ్చారు. ఇలా కష్టపడ్డ వారంతా ఇప్పుడు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెంచుకున్నారు.

కష్టపడ్డారు

జిల్లాలో కొందరు నేతలు టీడీపీ కోసం అహర్నిశలు కృషి చేశారు. కొందరు టికెట్ ఆశించి కష్టపడ్డారు. సమీకరణల నేపథ్యంలో వారికి టికెట్ ఇవ్వకుండా వేరేవారికి ఇచ్చారు. కడపలో టీడీపీ ఇన్‌చార్జిగా అమీర్‌బాబు కొనసాగారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కడప ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. అలాగే అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మిరెడ్డి కుటుంబం కూడా టికెట్ ఆశించింది. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లకు గాను ఒకేఒక్క డివిజన్‌లో టీడీపీ గెలుపొందింది. ఆ ఒక్కటీ అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబం కావడం గమనార్హం. దీంతో కడప టికెట్ రేసులో లక్ష్మిరెడ్డి కోడలు, 49వ డివిజన్ కార్పొరేట్ ఉమాదేవి పేరు బలంగా వినిపించింది. అనూహ్యంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవి తెరపైకి వచ్చారు. లక్ష్మిరెడ్డి, కోడలు ఉమాదేవి టికెట్ కోసం అప్పట్లో లోకేశ్‌ను కూడా కలిశారు. న్యాయం చేస్తామంటూ అప్పట్లో లోకేశ్, చంద్రబాబు వారికి హామీ ఇచ్చారంటారు. 2019-22 మధ్య ఇన్‌చార్జ్‌గా వీఎస్ అమీర్‌బాబు పనిచేశారు. పార్టీ కోసం కష్టపడి తమ ఆస్తులు పోగొట్టుకున్నట్లు చెబుతారు. టీడీపీ ప్రభుత్వం రావడంతో ఎలాగైనా న్యాయం చేస్తారని ఆయన నమ్ముతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి పార్టీలో ఉన్నారు. టీడీపీ నిర్వహించే మహానాడు, ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి వేడుకలతో పాటు ఇతరవాటిల్లో ఆయన చురుగ్గా పాల్గొంటూ ఉంటారు. పార్టీ మారకుండా టీడీపీని అంటిపెట్టుకుని ఉన్నారు. నామినేటెడ్ పదవిపై ఈయన ఆశ పెట్టుకుని ఉన్నారు. వీరితో పాటు నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి సైతం ఆశతో ఉన్నారు. ఎన్నికల్లో ఆయన ఏరియాలో అన్ని బూత్‌లలో టీడీపీకి ఆధిక్యత వచ్చింది. దీంతో తనకు ఏదో ఒక పదవి వస్తుందని ఆయన నమ్ముతున్నారు. బలిజ కోటాలో తనకు ఏదైనా పదవి వస్తుందని హరిప్రసాద్ భావిస్తున్నారంటారు. ఇంకా పలువురు పోటీ పడుతున్నారు. బద్వేలులో కూటమి అభ్యర్థిగా బీజేపీ పోటీ చేసి ఓడింది. ఇప్పుడు అక్కడ పదవుల పంపిణీ చాలా కీలకంగా మారింది. గతంలో వైసీపీలో ఉన్న నేతలే ఇప్పుడు మళ్లీ అధికార పక్షాన చేరారంటారు. దీంతో మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న తమకు అన్యాయం జరుగుతుందేమో అని టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. ఇక మైదుకూరులో పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపుకోసం కూటమి శ్రేణులు కష్టపడ్డారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి మరో టీడీపీ నేత సురేశ్‌నాయుడు టికెట్ ఆశించారు. వైసీపీ తప్పుడు కేసులు నమోదు చేయడంతో అప్పట్లో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రెండుసార్లు జైలుకు వెళ్లివచ్చారు. ఇక్కడ నామినేటెడ్ పదవులకు సంబంధించి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి, సురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పుల్లయ్య, ముక్తియార్‌తో పాటు మరికొందరి పేర్లు వినిపిస్తున్నాయి. ఇక జమ్మలమడుగులో బీజేపీ నుంచి ఆదినారాయణరెడ్డి గెలుపొందారు. ఇక్కడ 50 శాతం పదవులు బీజేపీకి పోతే మిగతావి టీడీపీ, జనసేన పంచుకోనుంది. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య పదవుల పంపకాలు జరగనున్నాయి. కమలాపురంలో పుత్తా చైతన్యరెడ్డి, పులివెందులలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి నేతృత్వంలో పదవుల పంపిణీ జరగనుంది.



ఏ పార్టీకి ఎన్ని పదవులంటే..

పదవుల పంపిణీలో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట ఆ పార్టీకి 60శాతం, జనసేనకు 30 శాతం, 10 శాతం బీజేపీకి ఇవ్వనున్నారు. జనసేన ఎమ్మెల్యేగా ఉన్న చోట ఆపార్టీకి 60శాతం, టీడీపీకి 30, బీజేపీకి 10 శాతం.. బీజేపీ ఉన్న చోట ఆ పార్టీకి 50, మిగతా 50 శాతం పదవులు టీడీపీ పంచుకోనున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కష్టపడ్డాయి. అయితే ఎమ్మెల్యేలు, స్థానిక నేతల సిఫారసు లేకుండా కష్టపడ్డ వారిని గుర్తించి పదవులు ఇస్తే ఆయా పార్టీల వృద్ధికి తోడ్పడుతుంది. అలా కాకుండా సిఫారసులకు ప్రాధాన్యం ఇస్తే హార్డ్‌కోర్ ఫ్యాన్స్‌కు పదవులు దక్కవు. ఆయారం గయారాంలకు పదవులు ఇస్తే కూటమి పార్టీలకు ఆవగింజంత కూడా ఉపయోగం ఉండదు. ఇప్పటికే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ కోసం కష్టపడ్డ కరుడుగట్టిన కేడరును పక్కన పెట్టేశారు. భజన బ్యాచ్‌నే దగ్గర పెట్టుకున్నారు. అందులోనూ రెండు సామాజిక వర్గాల వారే ఇప్పుడు ఎమ్మెల్యేల వద్ద ఉన్నారు. ఇది ఇప్పటికే కేడరుకు బ్యాడ్ సిగ్నల్ పంపుతోంది. ఇక పదవుల్లో కూడా హార్డ్‌కోర్ బ్యాచ్‌కు ఇవ్వకుండా సిఫారసు, భజన బ్యాచ్‌కు ఇస్తే మరోసారి కేడరుకు నిరాశ తప్పదు. ఇది వచ్చే ఎన్నికల్లో విజయావకాశాలపై ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్



రోడ్డు భద్రత ఆంక్షలు కఠినతరం

- వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే..
- 9542800800కు ఫిర్యాదు చేయవచ్చు : కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 26: ప్రజల ప్రాణసంరక్షణ కోసం రోడ్డు భద్రత ఆంక్షలను కఠినతరం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ హాల్లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ అదితి సింగ్, కమిటీ మెంబరు, కన్వీనర్ డీటీసీ మీరాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం మరణాలు రోడ్డు ప్రమాదాలవల్లే జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే రహదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కఠినతరం చేయాలన్నారు. డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు కారకులైన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రయోజనాలకు దూరంగా రోడ్డు భద్రతా చర్యలు ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థలు, పెట్రోల్ బంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలు నడపడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, సామాగ్రి రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనాలు నడిపేవారిని గమనించి వాహనం నెంబరు కనిపించేలా ఫొటో తీసి సిటిజన్ పోలీసింగ్ వాట్సాప్ నెంబరు 9542800800కు ఫిర్యాదు చేయాలన్నారు.

జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ కార్యాలయం అకస్మిక తనిఖీ

కడప(కలెక్టరేట్), జూలై 26: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్పీ సిసోడియా జిల్లా స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధమైన ఘటనకు సంబంధించి ఆయన సోమవారం నుంచి అక్కడే మకాం వేసి విచారణ చేపట్టారు. విచారణ ముగించుకుని శుక్రవారం ఉదయం విజయవాడకు వెళుతూ మార్గమధ్యంలో కడపలోని స్టాంప్స్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ జిల్లాకు సంబంధించిన పలు రకాల ఫైల్స్‌ను కలెక్టర్, జేసీతో కలసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కడా సమస్యలు రాకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వర్తించాలని జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబుకు సూచించారు. అంతకు ముందు కడప కలెక్టరేట్‌లో ఆర్పీ సిసోడియాకు కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ అదితిసింగ్ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబరులో ఆయన మీడియాతో మాట్లాడారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల కాల్చివేత ఉద్దేశ్య పూర్వకంగా జరిగినట్లు భావిస్తున్నామన్నారు. అగ్నిప్రమాదంలో 2440 ఫైళ్లు కాలిపోయాయన్నారు. డీకేటీ, చుక్కల భూములకు సంబంధించి అన్నీ రీ ఎంక్వయిరీ చేయిస్తామన్నారు. మళ్లీ కరెంట్ ఫైల్స్‌ను రీక్రియేట్ చేయిస్తామన్నారు. హడావిడి లేకుండా విచారణ చేసి అన్ని విషయాలను త్వరలో బయటపెడతామన్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా

దేవదాయ భూముల పరిరక్షణలో రాజీ పడవద్దు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై 26: జిల్లాలోని దేవదాయ శాఖ భూముల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడవద్దని ఆ శాఖ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం దేవదాయశాఖ జిల్లా కార్యాలయంలో ఈవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సకాలంలో లీజు చెల్లించని కాంట్రాక్టర్ల నుంచి ఎండోమెంటు స్థలాలు, ఎండోమెంటు భూములకు తక్షణమే రక్షణ కల్పించాలని సంబంధిత ఆలయ ఈవోలను ఆదేశించారు. కోర్టు కేసుల్లో ఉన్న భూములను ఎండోమెంట్ కోర్టు ఆర్డర్స్ ప్రకారం కౌలుదారుల నుంచి రిలీవ్ చేయాలని, కౌలు, గుత్త చెల్లించని వారికి లీజ్ రద్దు నోటీసులు పంపించి దేవాలయ మాన్యాలను ఆలయ అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకరబాలాజీ, ఎండోమెంట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, ఆలయాల ఈవోలు పాల్గొన్నారు. అనంతరం దేవదాయశాఖ కార్యాలయ భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై 26: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వంలో ఏర్పాటైన పీఐసీ కమిటీలను రద్దు చేసి డీసీఎంఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టరును నియమించింది. ఈ మేరకు పూర్వపు జాయింట్ కలెక్టర్ గణేశ్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన స్థానంలో అదితిసింగ్ జేసీగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా కూడా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారిణి సుభాషిణి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరు ఖాదర్‌వలి గౌరవపూర్వకంగా జేసీని కలిశారు.

ఇసుక పంపిణీ పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప(కలెక్టరేట్), జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక పంపిణీ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి నూతనఇసుక పాలసీ విధానంపై మైన్స్, జియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఇతర శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టాలన్నారు. కలెక్టర్‌కు కంప్లీట్ కంట్రోల్ ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో 11 స్టాక్ పాయింట్లలో ఉన్న 3,67153 మెట్రిక్ టన్నుల ఇసుకను పంపిణీ చేశామన్నారు. ఇంకా స్టాక్ పాయింట్లలో 2,87,336 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక పాలసీలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ ఆర్‌ఐ విమల, డీటీసీ మీరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు కట్టేందుకు ఎటువంటి అనుమతులూ లేవు.. అయినా అడ్డగోలుగా కట్టేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. పోలీసులతో భయపెట్టి.. మూడు కార్తెలు పండే తల్లిలాంటి భూములు లాక్కున్నారు. పైసా పరిహారం ఇవ్వకుండానే.. దౌర్జన్యంగా పట్టాదార్ పాస్‌పుస్తకాలూ తీసేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధమని ఎన్‌జీటీ అక్షింతలు వేస్తే ఇప్పుడు ప్రాజెక్టునే ఆపేశారు. ఇక అది ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. సేద్యం చేయడానికి భూముల్లేక.. చేద్దామంటే కూలి పనులూ లేక నిర్వాసిత రైతులు విలవిలలాడుతున్నారు.

నాడు పంటలతో పొలాలు కళకళ..



నేడు పిచ్చిమొక్కలతో నిండిన పొలాలు..



పెద్దిరెడ్డీ.. దీన్నేమంటారు..?




అసంపూర్తిగా నిలిచిపోయిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు

- అనుమతుల్లేకుండానే ముదివేడు రిజర్వాయర్ నిర్మాణం
- నాటి మంత్రి మాటే వేదంగా..
- గుడ్డిగా పనులు చేసేసిన అధికారులు
- ఎన్‌జీటీ కన్నెర్రతో నిలిచిపోయిన ప్రాజెక్టు
- ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి
- భూములు కోల్పోయిన రైతులు గగ్గోలు
- ప్రాజెక్టు కోసం వారి పొలాల ఆక్రమణ
- పైసా పరిహారం ఇవ్వకుండానే..
- పాస్ పుస్తకాలు లాక్కున్న వైనం
- సేద్యానికి భూముల్లేవు.. చేయడానికి పనులూ లేవు
- ముదివేడు రిజర్వాయర్ బాధితుల ఆవేదన

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎక్కడైనా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలంటే పెద్దతతంగమే ఉంటుంది. పర్యావరణ అనుమతులు తప్పనిసరి. అయితే అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చేపట్టిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎటువంటి అనుమతులూ లేవు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే.. తమ సామ్రాజ్యంగా భావించే పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఈ కుటుంబం మూడు ప్రాజెక్టులు నిర్మించాలని భావించింది. ఈ ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ఉపయోగం ఉంటుందో ఉండదో అని కాకుండా.. తామెంత వెనుకేసుకోవచ్చనే ఆలోచనతోనే వీటిని తలపెట్టారని జనం ఆరోపిస్తున్నారు. అనుకున్నదే తడవుగా చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నేతిగుట్టపల్లె వద్ద నిర్మిస్తున్న ఒక రిజర్వాయర్, సోమల మండలం ఆవులపల్లె వద్ద మరో రిజర్వాయర్, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట ముదివేడు వద్ద ఇంకో రిజర్వాయర్ నిర్మాణానికి నిర్ణయించుకున్నారు. పర్యావరణ అనుమతుల కోసం నేతిగుట్టపల్లె రిజర్వాయర్‌కు మాత్రమే జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)కి జగన్ ప్రభుత్వం దరఖాస్తు చేసింది. ఆ అనుమతులు రాకముందే ఈ రిజర్వాయర్ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయి. ఒక టికెట్‌కు మూడు సినిమాలు అన్నట్లు.. ఈ దరఖాస్తుతోనే.. మిగిలిన రెండు రిజర్వాయర్ల పనులూ మొదలు పెట్టారు. రాష్ట్ర మంత్రిగా పెద్దిరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా ఆయన సోదరుడు ద్వారకానాథరెడ్డి, రాజంపేట ఎంపీగా ఆయన తనయుడు మిథున్‌రెడ్డి బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండీ.. నిబంధనలు తుంగలో తొక్కి.. అనుమతుల ఊసు లేకుండానే పనులు చేపట్టాలని ఆదేశించడంతో.. అధికారులు అదేమిటని అడగకుండా.. పెద్దిరెడ్డి మాటలే వేదవాక్కుగా భావించి.. గుడ్డిగా పనులు మొదలు పెట్టి... శరవేగంగా పూర్తి చేశారు. ఆవులపల్లె కేవలం జంగిల్ క్లియరెన్స్ పనుల వద్ద ఉండగా.. ముదివేడు రిజర్వాయర్ పనులు సుమారు 70 శాతం పూర్తయ్యాయి. అయితే అనుమతులు లేకుండా పనులు చేపట్టినందుకు.. అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినందుకు.. ఈ పనులను నిలిపేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌జీటీ రూ.100 కోట్ల భారీ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. దీనిని సుప్రీంకోర్టు సైతం సమర్థించింది.

పరిహారం ఇవ్వకుండానే 1,075 ఎకరాలు..

ముదివేడు రిజర్వాయర్ కోసం కురబలకోట మండలం ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె, బి.కొత్తకోట మండలం కొత్తఊరు గ్రామాల్లో భూములను ప్రభుత్వం సేకరించింది. పట్టా, ప్రభుత్వ, డీకేటీ భూములతో కలిపి మొత్తం 1075.81 ఎకరాలు ఇందులో ఉన్నాయి. ముదివేడు గ్రామం చౌటగుంటపల్లె, కొత్తపల్లె, శీతోళ్లపల్లె (శీతువారిపల్లె), నడింగడ్డలు పూర్తిగా రిజర్వాయర్ కింద మునిగిపోతాయి. సీతువారిపల్లెలో 45 ఇళ్లు, కొత్తపల్లెలో 35, చౌటగుంటలో 100 ఇళ్లలో 50, నేతాజినగర్‌లో 10 ఇళ్లు మునకలో పోతాయి. రిజర్వాయర్ మునకలో అప్పలమ్మచెరువు, శీతోళ్లపల్లె చెరువు, జమ్ముకుంట పోతాయి. ఈ చెరువుల కింద.. ఎటువంటి చీకూచింతా లేకుండా ఏటా మూడు పంటలు పండించుకునే వాళ్లమని రైతులు ఆవేదన చెందుతున్నారు. పైసా నష్టపరిహారం ఇవ్వకుండానే తమకు కావలసిన భూములను కాంట్రాక్టర్లు రైతుల నుంచి లాగేసుకున్నారు. పనులు మొదలు పెట్టి.. భూముల్లో పెద్ద పెద్ద గుంతలు తవ్వి.. మట్టి తరలించారు. తమకు నష్టపరిహారం ఇచ్చేంత వరకు పనులు చేయవద్దని రైతులు అడిగితే పోలీసులతో బెదిరించారు. పనులు మొదలైన సుమారు రెండేళ్ల తర్వాత ఎకరాకు రూ.12.5 లక్షలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఒక్క రైతుకు కూడా పైసా నష్టపరిహారం ఇవ్వలేదు. పైగా వారి నుంచి బలవంతంగా పట్టాదార్ పాసుపుస్తకాలు లాక్కున్నారు. ఆ భూములూ తీసేసుకున్నారు.. ఇప్పుడు ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. భూములు సేద్యానికి పనికిరాకుండా పోయాయి.. బయట పనులకు వెళ్లాలన్నా.. కూలి పనులు లేవు.. ఎలా బతకాలని రైతులు వాపోతున్నారు. ముంపునకు గురయ్యే సీతువారిపల్లెలో సుమారు 70 కుటుంబాలు ఉంటాయి. ఈ పల్లెలో దాదాపు ప్రతి రైతూ ఏదో ఒక విధంగా నష్టపోయేవారే ఉండడం గమనార్హం. అనుమతుల్లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టు సంస్థ, పనులు చేయించిన పెద్దిరెడ్డి కుటుంబం, అధికారులపైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అనుమతుల్లేకుండా పనులు చేయడం నేరమని తెలిసినా.. వాటిని పర్యవేక్షించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 'పచ్చగా బతుకుతున్న మా బతుకుల్లో.. నిప్పులు పోశారు.. మా రోదనలు.. వేదనల మీద డబ్బు మేడలు కట్టుకున్నారు. పెద్దిరెడ్డీ.. దీన్నేమంటారు' అని వారు నిలదీస్తున్నారు.



ఇప్పటికీ పరిహారం లేదు..

ఎకరాకు రూ.12.5 లక్షలు ఇస్తామని కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు వచ్చి చెప్పారు. పదెకరాలు తీసుకున్నారు. అదనంగా ఇంకో ఎకరాలో డబ్బు ఇస్తామని చెప్పి మట్టి తోడేశారు. చెప్పిన నష్టపరిహారం ఇప్పటికీ ఇవ్వలేదు. డబ్బులిస్తామని మా దగ్గర పట్టాదారు పాసుపుస్తకం తీసేసుకున్నారు. మా ఊరు మునకలో పోతోంది. ఇల్లు కట్టిస్తామని చెప్పారు. కట్టించలేదు. కనీసం జాగా అయినా చూపించాలని అడిగితే.. అదిగో.. ఇదిగో అంటూ గడిపేశారు.

- మధుసూదన్‌రెడ్డి, శీతువారిపల్లె


చట్టవిరుద్ధంగా తీసుకున్నారు..



ముదివేడు రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతి లేదని తెలిసీ చట్టవిరుద్ధంగా మా భూములు తీసేసుకున్నారు. పల్లెకు దారి లేకుండా చేశారు. మావి పది ఎకరాలు ప్రాజెక్టు కింద పోయాయి. నష్టపరిహారం కూడా ఇవ్వకుండా రైతుల నోళ్లు కొట్టడం అన్యాయం. పాలు అమ్ముకోవాలన్నా.. కష్టంగా ఉంది. వ్యాన్‌లు మా ఊరికి రావడం లేదు. మేమే రెండు కిలోమీటర్లు వెళ్లి పాలు పోసి వస్తున్నాం. ఈ ప్రభుత్వమైనా మమ్మల్ని ఆదుకోవాలి.

- శివశంకర్‌రెడ్డి, శీతువారిపల్లె

అధికారులు సంతకాలు తీసుకున్నారు..



అధికారులు మమ్మల్ని మండల ఆఫీసు దగ్గరకు పిలిపించి.. మా దగ్గర ఆరేడు పేపర్ల మీద సంతకాలు తీసుకున్నారు. నష్టపరిహారం ఇస్తారనుకున్నాం.. ఇవ్వలేదు. మా దగ్గర ఉండే పట్టాదార్ పాస్‌పుస్తకాలు కూడా తీసేసుకున్నారు. ఇప్పుడు ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి.. మా పాస్‌పుస్తకాలు మాకు ఇచ్చేయాలి. పొలాల్లో గుంతలు తవ్వడంతో.. పంటల సాగు ఆటుంచి.. కనీసం పశువుల మేతకు కూడా ఇబ్బందులు పడుతున్నాం.

- ద్వారకానాథరెడ్డి, శీతువారిపల్లె

సచివాలయంలో రాత్రి వేళ ఆ వ్యక్తి ఎవరో?



సచివాలయంలో కంప్యూటర్ సీటులో కూర్చుని ఉన్న వ్యక్తి

జమ్మలమడుగు, జూలై 26: 19, 20 వార్డుల సచివాలయంలో రోజూ రాత్రిళ్లు ఓ వ్యక్తి కంప్యూటర్ సీటులో ఉంటున్నాడు. ఈ విషయం ఆ ప్రాంతీయుల ద్వారా తెలుస్తోంది. రోజూ సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడున్న సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ఏదైనా ఎక్కువ పని ఉన్నప్పుడు ఆరు గంటల వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే రోజూ ఆ కార్యాలయంలో ఆయన రాత్రిళ్లు 10 గంటల వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. పనిచేస్తున్న ఉద్యోగి అయితే కంప్యూటర్ వర్కు చేస్తుంటాడు. కానీ అక్కడ పనిచేస్తున్న ఉద్యోగినా, లేక బయటి వ్యక్తా అనే అనుమానం స్థానికుల్లో ఉంది. గురువారం రాత్రి 10 గంటల వరకు సచివాలయంలో ఉన్నట్లుగా స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఈ సమస్యకు సంబంధించి సచివాలయ అడ్మిన్ రమణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రోజూ సచివాలయంలో రాత్రి సమయంలో విధులు ఎవరైనా నిర్వహిస్తున్నారా అని అడిగితే రాత్రిళ్లు ఎవరూ ఉండరని ఆయన తెలిపారు. ఒకవేళ ఎవరైనా సచివాలయంలో వచ్చి ఉంటే రాత్రి సమయాల్లో ఉండకూడదని చెప్పడం జరుగుతుందని ఆయన తెలిపారు.

తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో ఘనంగా పుష్పయాగం



సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వాముల పుష్పయాగానికి సిద్ధంగా ఉన్న పూలు

రాజంపేట, జూలై 26: తాళ్లపాకలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వాములకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పుష్పయాగంలో భాగంగా సిద్దేశ్వర, చెన్నకేశవ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల నడుమ స్వామివార్లకు పుష్పయాగం మహోత్సవాన్ని అత్యంత రమణీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లపాక దేవాలయం ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి, సర్పంచ్ గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ఆర్.స్వామినాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్సీ జకియాఖానం



నారా లోకేశ్‌తో శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం

రాయచోటిటౌన్, జూలై26: శాసనమండలి లాబీలో శుక్రవారం వైసీపీ ఎమ్మెల్సీ, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటికే మంత్రి ఫరూక్‌తో భేటీ అయిన జకియాఖానం ఈ రోజు లోకేశ్‌బాబును కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్టసభలను బహిష్కరించినా జకియాఖానం మాత్రం మండలి సమావేశాలకు హాజరవుతున్నారు. త్వరలో ఆమె టీడీపీలో చేరుతున్నారంటూ వైసీపీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

ఇసుకను ఉచితంగా అందించడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

రాయచోటి (కలెక్టరేట్)జూలై26: ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వారు అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత ఇసుక పాలసీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఉచిత ఇసుక పాలసీపై ఇచ్చిన జీఓ 43ని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు.జిల్లాలో వీలైనంత ఎక్కువ ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మైనింగ్ అధికారి రవి ప్రసాద్,నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక తరలించే వాహనాలు సీజ్

రాజంపేట, జూలై 26: అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న పలు వాహనాలను మన్నూరు పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. కొందరు మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో మన్నూరు పోలీసులు వాటిని అదుపులోకి తీసుకున్నారు. జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రవీంద్రనాథ్ తెలిపారు. కావున ఇసుక అక్రమంగా తరలించవద్దని అలా తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఖాజీపేట, జూలై 26: అక్రమంగా పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఖాజీపేట పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే... శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆమేరకు నిఘా పెట్టగా రెండు ట్రాక్టర్లను పట్టుకుని సంబంధిత అధికారులకు రెఫర్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులకు ముగ్గురు బాలుర అప్పగింత



పట్టుబడిన విద్యార్థులతో బద్వేలు ఎస్ఐ సత్యనారాయణ

చెన్నూరు, జూలై 26: ఇంటి నుంచి వెళ్లిన బాలురు హేమంత్‌కుమార్, దాయాల తరుణ్, గుణవర్ధన్‌ను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక లక్ష్మీనగర్ వాసి హేమంత్‌కుమార్, మరో ఇద్దరు స్నేహితులు 8వతరగతి చదువుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం స్కూలుకు వెళుతున్నామని చెప్పి సైకిల్‌లో వెళ్లి సైకిలును రూ.700కు అమ్మి ఇంట్లో చెప్పకుండా వెళ్లారు. బాలురు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలలో అడిగితే రాలేదనడంతో గాబరా పడిన తల్లిదండ్రులు చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాయుడు, కానిస్టేబుల్ వీరారెడ్డి బాలుర ఫోటోలను జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లకు పంపించారు. దీంతో బద్వేలు సీఐ యుగంధర్‌కు సమాచారం అందడంతో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందితో బద్వేలు బస్టాండు ఆవరణలో తనిఖీ చేపట్టారు. అక్కడ తప్పిపోయిన ముగ్గురు పిల్లలను ఎస్ఐ సత్యనారాయణ బాలుడిని గుర్తించి పట్టుకున్నారు. విషయాన్ని చెన్నూరు పోలీసులకు తెలపడంతో వారి తల్లిదండ్రులను రప్పించి అప్పగించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప (క్రైం), జూలై 26: స్థానిక ఆర్టీసీబస్టాండు సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రఫి తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయసు 55 ఏళ్లు ఉంటాయన్నారు. ఇతర వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తిస్తే తమను సంప్రదించి మరింత సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9121100520, 9121100521, 9121100522లకు ఫోను చేయాలన్నారు.

ఫుడ్ టెక్నాలజీ - ఉపాధి ఈజీ

ఇంజనీరింగ్‌కు దీటుగా కోర్సులు ● యువతకు పెరుగుతున్న ఆసక్తి

దేశవిదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు

పులివెందుల, జూలై 26: దేశ, విదేశాల్లోనూ ఫుడ్ టెక్నాలజీతోనూ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. కేంద్ర విభాగాల్లోనూ అనేక ఉద్యోగాలు పొందుతున్నారు. బీటెక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఫుడ్ టెక్నాలజీ కళాశాల వివిధ కోర్సులు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తోంది. ముఖ్యంగా బీటెక్ అంటే కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, సివిల్, మెకానికల్ తదితర కోర్సులు మాత్రమే ఉంటాయి. కానీ సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీలో చేసే కోర్సులు కూడా బీటెక్‌లోకి వస్తాయి. ఈ కోర్సులు పూర్తిచేసిన వెంటనే విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలుమెండుగా ఉన్నాయి. పులివెందుల వద్దనున్న సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులకు వివిధ రాష్ట్రాలు, విదేశాల్లో సైతం ఉపాధి పొందారు.

రాయలసీమ ప్రాంత పరిశ్రమలకు సేవ చేయడానికి, ఉత్పత్తిపరంగా ఆహార తయారీ యూనిట్లను పెంచడానికి, ఫుడ్ టెక్నాలజీ రంగంలో మానవ వనరుల అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో 2008లో ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పులివెందులలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలను ప్రారంభించారు. నాలుగేళ్ల బీటెక్ ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ కోర్సును



అందిస్తోంది. ఇటీవల కళాశాలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) గుర్తింపు కూడా పొందింది. ఫుడ్‌ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఆహార భద్రత, నాణ్యత విశ్లేషణ, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెట్‌లో స్పెషలైజేషన్ కలిగి ఉన్న అత్యుత్తమ ప్రభుత్వ అధ్యాపకులు, బోధన, ప్రదర్శనకు తగిన అత్యాధునికత మౌలిక సదుపాయాలున్నాయి. విద్యార్థులు పోటీ పరీక్షలు, ఉద్యోగాలకు ఎలా తయారు కావాలో అడ్వైజరీ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ఎటర్‌ప్రెన్యూర్లుగా తయారు చేసేందుకు సెమిస్టర్ లాంగ్ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ వంటి వర్క్ ఎక్స్‌పీరియన్స్ అవకాశాలను కళాశాల కల్పిస్తోంది.

ఎల్‌బీఐ సెంటర్ ఏర్పాటు

చిరుధాన్యాలు, పండ్లు ప్రాసెసింగ్ కోసం బెంగుళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ సౌజన్యంతో ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ సహకారంతో ఎల్‌బీఐ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్ ద్వారా రైతులకు, గ్రామీణ యువతకు, మహిళలకు, విద్యార్థులకు పలువర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దేశ విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగాలు

కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఆల్ ఇండియా గేట్ టెస్, ఆల్ ఇండియా కామన్ అడ్మిషన్ టెస్ట్, ఐకార్ - జేఆర్ఎఫ్, జీఆర్ఈ, టోఫెల్ వంటి పోటీపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పలుదేశ, విదేశాల ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఈ కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు కెనెడా, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఆహార పరిశ్రమల్లో వివిధ విభాగాల్లో ఉద్యోగాలు సాధించారు. అమెరికా, ఫిన్‌లాండ్, దుబాయ్, మలేషియా వంటి దేశాల్లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ప్రోగ్రాం ద్వారా ఉచితంగా శిక్షణ పొందారు. కేంద్ర, రాష్ట్ర హార భద్రత అధికారులు, యూనివర్సిటీల్లో అధ్యాపకులుగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రేమకుమార్, సందీప్‌కుమార్ పల్విషాట్స్, ఇమ్రాన్, సారికలు ప్యారడైస్ ఫుడ్ కోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను ఏర్పాటుచేసి ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణించారు.

విశేష అవకాశాలు



ఫుడ్ టెక్నాలజీ కోర్సు చదివిన వారికి ఆహార అనుబంధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయి. బీటెక్ నాలుగేళ్ల ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ అందుబాటులో ఉన్నాయి. ఇంటర్‌మీడియేట్ ఎంపీసీ, బైపీసీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులు. ఎంపీసీ పూర్తి చేసిన నాన్ ఫార్మర్స్ కోటా విద్యార్థులు ఏపీ-ఈఏపీసీఈటీలో ర్యాంకులు సాధించి ఏపీ స్టేట్‌కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) వెబ్‌సైట్ ద్వారా వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలి. బైపీసీ పూర్తిచేసిన విద్యార్థులు ఫార్మర్స్ కోటా, నాన్ ఫార్మర్స్ కోటా ద్వారా కౌన్సిలింగ్‌లో పాల్గొని ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ అడ్మిషన్ పొందవచ్చు.

డాక్టర్ ఎం.ఎస్.బేగ్, అసోసియేట్ డీన్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, పులివెందుల

ఫుడ్ క్వాలిటీ అనలిస్ట్ అవుతా



ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో సమగ్ర పాఠ్యప్రణాళిక ఉండడం వలన ఆహార శాస్త్రం, నాణ్యత, ఆహార భద్రతకీలక అంశాలపై పట్టుసాధించాను. ఈరంగంలో నా ఆసక్తిని రేకెత్తించింది. ప్రస్తుతం లండన్‌లోని గ్రీన్‌విచ్ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీని అభ్యసిస్తున్నాను. ఫుడ్ క్వాలిటీ అనలిస్ట్ అవుతాను. ఆహార ఉత్పత్తులు అత్యధిక భద్రత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రజారోగ్యానికి దోహదపడతాను.

ప్రభావతి, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరుజిల్లా

ఎఫ్ఎస్ఎస్ఏఐలో ప్రభుత్వ ఉద్యోగం సాధించా



ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల నుంచి పట్టా అందుకున్నాను. నేను ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ ఫుడ్ సేఫ్టీ అండ్‌స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ఉత్తర ప్రాంతీయ కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా. ప్రజల జీవితాల్లో అర్థవంతమైన మార్పులను తీసుకురావడం ద్వారా ప్రజలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నందున ఉద్యోగం సంతృప్తినిస్తోంది. ఆహార భద్రతను కాపాడడంలో నావంతు ప్రయత్నం అందించడానికి కృషిచేస్తున్నాను.

కొప్పెర స్వప్న, నంద్యాల, నంద్యాల జిల్లా

కంట్రోల్ ఆఫీసర్‌గా ఉద్యోగం



నాయుడుపేటలోని ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. పోటీ పరీక్షలు, ఉద్యోగాలకు ఎలా తయారు కావాలో అడ్వైజరీ క్లాసల ద్వారా విశ్లేషిస్తున్నారు. విద్యార్థులను ఎటర్‌ప్రెన్యూర్లుగా తయారు చేసేందుకు సెమిస్టర్ లాంగ్ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ అవకాశాలను కళాశాల కల్పిస్తోంది. పులివెందుల కళాశాల ప్రయోగశాలలో మంచి పరికరాలున్నాయి. అధ్యాపకులు ఇచ్చిన ప్రాక్టికల్ ఓరియెంటెడ్ టీచింగ్ వల్ల నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను.

విశ్వనాథరెడ్డి, మైదుకూరు, కడపజిల్లా

హైకోర్టు జస్టిస్‌ను కలిసిన బార్ అసోసియేషన్



హైకోర్టు జస్టిస్ భానుమతికి వినతి పత్రం అందజేస్తున్న కడప బార్‌అసోసియేషన్ నేతలు

కడప(రూరల్) జూలై 26: రాష్ట్ర హైకోర్టు జస్టిస్, జిల్లా పోర్ట్‌ఫోలియో జస్టిస్ భానుమతిని శుక్రవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శి కెనడి, ఉపాధ్యక్షులు సి. చంద్రమోహన్, నేతలు చిన్నయ్య, నాగభూషణం తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో ఉన్న సమస్యలను జస్టిస్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జిల్లా కోర్టు సముదాయంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను భర్తీచేయాలని, 2019లో డెమాలిష్ చేసిన స్థలంలో నూతన కోర్టుల సముదాయాన్ని నిర్మించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే చెప్పండి పరిష్కరిస్తామని జస్టిస్ అనడం సంతోషమన్నారు. అనంతరం జిల్లాలోని ఇతర బార్‌అసోసియేషన్ సభ్యులు కూడా జస్టిస్‌ను కలిశారు.

● జిల్లా కలెక్టర్‌కు విన్నపం

జిల్లా న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టర్ టి. శివశంకర్‌కు రెప్రజెంటేషన్ ద్వారా వివరించారు. న్యాయవాదుల్లో చాలా మందికి హౌస్‌సైట్స్ లేనందువలన ప్రభుత్వమే అడ్వకేట్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వ భూమిని నామినల్ రేటుకు ఇచ్చి న్యాయవాదులకు హౌస్‌సైట్ ఇప్పించాలని కోరారు.

హైకోర్టు జస్టిస్‌ను కలిసిన జిల్లా ప్రధాన జడ్జి

హైకోర్టు జస్టిస్, జిల్లా పోర్ట్‌పోలియో జస్టిస్ భానుమతిని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, ఇతర న్యాయమూర్తులు కలిశారు. న్యాయ సంబంధిత విషయాలను వివరించారు.

అగ్రహారంలో చోరీ

ఖాజీపేట, జూలై 26: మేజర్ పంచాయతీ అగ్రహారంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కుటుంబీల కథనం మేరకు గురువారం రాత్రి చినుకులు పడుతుండడంతో రేకుల షెడ్డులో నిద్రిస్తుండగా వెనుకవైపు నుంచి దొంగలు వాకిలి తొలగించి ఇంట్లో చొరబడి రెండు జతల కమ్మలు, బియ్యం బస్తా, కొద్దిమేర నగదు తీసుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాయమాటలతో ఆస్తులు రాయించుకున్నారు

ట్రస్ట్ పెద్దల నుంచి రక్షణ కల్పించండి ● డాడీహోం అనాథ పిల్లలకు న్యాయం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాధా

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: మాయమాటలు చెప్పి డాడీహోం ఆస్తులు రాయించుకుని, డాడీహోం ఖాతాలో ఉన్న రూ.1.20 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లను తీసుకున్నారని ప్రస్తుత ట్రస్ట్ చైర్మన్ బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి, బీజేపీ నేత గొర్రె శ్రీనివాసులుపై రాజా ఫౌండేషన్ కేర్ అండ్ చెయిల్డ్ చారిటబుల్ ట్రస్టు మాజీ చైర్మన్ రాధా ఆరోపించారు. శుక్రవారం కడప, ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో వేర్వేరుగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ ట్రస్టుకు చెందిన ప్రభాకర్ మిమ్మల్ని చంపుతారని వారు భయభ్రాంతులకు గురిచేశారన్నారు. డాడీహోం ఆస్తుల డాక్యుమెంట్లలో ఏమి రాశారో తమకు చూపించకుండానే రిజిస్టర్ కార్యాలయంలో సంతకాలు పెట్టించుకున్నారన్నారు. అనాథ పిల్లల పట్ల ప్రతిపాదించిన డిమాండ్లపై మీకు న్యాయం చేస్తామని, మీ ఆశయాలను ముందుకు తీసుకెళుతామని చెప్పి డాక్యుమెంట్లు చేతికి రాగానే తమను పక్కనబెట్టారని వాపోయారు. బీజేపీ నేత గొర్రె శ్రీనివాసులుకు ఆడవారితో ఎలా మాట్లాడాలో కూడా తెలియదని విమర్శించారు. గురువారం పూజా స్కూలుకు వచ్చిన ఆయనను అనాథ పిల్లలకు అన్యాయం చేశారని విమర్శిస్తే తనపై చెయ్యి ఎత్తాడని అసభ్యంగా మాట్లాడటమే కాకుండా మిమ్మల్ని ఈడ్చి పడేస్తానని ఆగ్రహించాడన్నారు. ఆయనపై ఫిర్యాదు చేయడానికి రూరల్ పోలీసు స్టేషన్‌కు పోతే కేసు పెట్టవద్దని బీజేపీ పెద్దల నుంచి బెదిరింపులు వస్తున్నాయన్నారు. తనకు, కవితకు మధ్య గొడవలు పెట్టారని, తమను నమ్మించి మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డాడీహోం అకౌంట్‌లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రూ.20 లక్షలను డ్రా చేసి వారు తమ సంస్థలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. బయటి ప్రాంతాల్లో చదువుతున్న పది మంది పిల్లలకు రూపాయి ఫీజు చెల్లించలేదన్నారు. డాడీహోం కిరాణా సరుకులు, మెడిసిన్ బిల్లులు చెల్లించలేదని వాపోయారు. రాజారెడ్డి హత్యలో తమ పాత్ర ఉందని బుశెట్టి రామమోహన్‌రావు ఆరోపించడం దారుణమన్నారు. తమను డాడీహోం నుంచి బయటకు పంపడానికి కుట్ర పన్నారని, అన్యాయంగా తమపైనే కేసు పెట్టించారని వివరించారు. రాజా ఫౌండేషన్ చైర్మన్ రాజారెడ్డి మరణంతో హోంలో వున్న 68 మంది మానసిక వికలాంగులు, పూజా ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో చదువుతున్న 400 మంది అనాథ పిల్లల జీవితాలు గాలిలో దీపాల్లాగా మారాయన్నారు. దీంతో డాడీహోంలో జరుగుతున్న విషయాలను చిన్నజియర్‌స్వామికి వివరించడానికి హైదరాబాదులో విష్ణుచింతన్‌స్వామిని కలిసి పది గంటలు నిరీక్షించినా స్వామిని కలిసే అవకాశం ఇవ్వలేదన్నారు. స్కూల్ కరెంటు బిల్లు రూ.14 వేలు చెల్లించాలని బుశెట్టి రామమోహన్‌రావుకు ఫోన్ చేస్తే విష్ణుచింతన్‌స్వామిని అడగాలంటారని, అటువంటప్పుడు ఆయన చైర్మన్‌గా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. డాడీహోం ఇన్‌చార్జి కిరణ్మయి మాట్లాడుతూ 16 ఏళ్లగా తాను ఇన్‌చార్జిగా పనిచేస్తున్నానని, రాజారెడ్డి ఉన్నప్పుడు ఎంతో సవ్యంగా జరిగాయని, నూతన కమిటీ వచ్చాకే సమస్యలు ఎదురయ్యాయన్నారు.

రూరల్ ఎస్ఐ చిరంజీవి వేధింపులు

రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ చిరంజీవి వేధింపులకు గురిచేశారని రాధా కన్నీటిపర్యంతమయ్యారు. విష్ణుచింతన్‌స్వామి , ఎస్ఐ చిరంజీవిని ట్రస్టు చైర్మన్ బుశెట్టి, గొర్రె శ్రీనివాసులు తమపైకి ఉసిగొల్పారని దీంతో ఆయన తమను రకరకాలుగా ఇబ్బంది పెట్టారని ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేవాడని అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా వచ్చి తమను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఆయన వేధింపులను గుర్తుకు తెచ్చుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈవిషయంలో కలెక్టర్, ఎస్పీ డాడీహోం అనాథ పిల్లలకు సరైన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనసూయ, అనాథ పిల్లలు పాల్గొన్నారు.

వలంటీరు నుంచి డబ్బు ఇప్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: మాయమాటలు చెప్పి తన డబ్బు కాజేసిన వలంటీరు నుంచి డబ్బు ఇప్పించాలని ఖాదరాబాదు వాసి అన్నదానం లత పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వలంటీరు గోపీకిశోర్ అవసరం ఉందని చెప్పి తన నుంచి రూ.4,80,000 తీసుకున్నాడన్నారు. డబ్బు తీసుకున్న తర్వాత పెళ్లి చేసుకోమని అడిగితే వలంటీరు దాడి చేశాడని తెలిపారు. ఆ దాడిలో తలకు, దవడకు, కంటికి తీవ్ర గాయాలై హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నానన్నారు. మరో మూడు ఆపరేషన్లు చేయాలని, తన డబ్బు ఇవ్వమంటే వలంటీరు స్పందించడంలేదని వాపోయారు. రూరల్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తే ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా తన డబ్బు ఇప్పించి వలంటీరును అరెస్టు చేయాలని కోరారు.

వీఆర్‌కు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

కడప (క్రైం), జూలై 26: కడప వన్‌టౌన్ ఎస్ఐ జి.మధుసూదన్‌రెడ్డిని వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ నెల 20న రాత్రి రాజీవ్‌పార్కు సమీపంలో వాహనాల తనిఖీ సమయంలో నవదీప్ అనే యువకుడిపై లాఠీని ఝుళిపించి దాడి చేసిన సంఘటనలో ఎస్ఐని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులను జారీ చేశారు. ఎస్ఐ చేసిన దాడిని పరిగణనలోకి తీసుకుని పోలీసుశాఖ తరపున క్రమశిక్షణ కింద ఈ చర్యలను తీసుకున్నారు.

తహసీల్దారు ప్రకాశ్‌బాబును ఆదర్శంగా తీసుకోవాలి



తహసీల్దారు ప్రకాశ్‌బాబును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చెన్నూరు, జూలై 26: తహసీల్దారు ప్రకాశ్‌బాబును ఆదర్శంగా తీసు కోవాలని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ తక్కువ సమయం పనిచేసినా ప్రజల నుంచి ఎక్కువ గౌరవం పొందారన్నారు. ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కర్నూలు నుంచి చెన్నూరు మండలానికి బదిలీపై వచ్చిన ప్రకాశ్ బాబు ప్రభుత్వ ఉత్తర్వుల మేర కు గురువారం సొంత మండలానికి బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆయన్ను నాయకులు, రెవెన్యూ కార్యాలయ సి బ్బంది ఘనంగా సన్మానించారు. డీటీ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంటు క్రిష్ణవేణి, సర్వేయరు సోమశేఖర్, ఆర్ఐలు సృజన, సౌజన్య, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

మెరుగైన విధి నిర్వహణతోనే ప్రజల్లో గుర్తింపు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న మహేశ్వరరెడ్డి

చక్రాయపేట, జూలై 26: మెరుగైన విధి నిర్వహణతోనే ఏ అధికారికి అయినా ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా కో ఆర్డినేటర్ పట్టెం అశోక్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర పేర్కొన్నారు. గురువారం బదిలీపై వెళ్తున్న చక్రాయపేట తహసీల్దార్ బెన్నురాజును వారు సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ బదిలీపై ఇక్కడికి వచ్చి అందరి మన్ననలు పొందారన్నారు. చక్కటి విధి నిర్వహణ, మంచిపేరుతో తిరిగి తన జిల్లాకు వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఆయనకు సన్మానం చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు శంకర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, ప్రసాదరెడ్డి,రమణారెడ్డి,పరమేశ్వర, అమర్‌నాథ్, యోగీశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు ఏఎస్‌ఐగా పదోన్నతి



సుధాకర్, ఏఎస్ఐ

చెన్నూరు, జూలై 26 : చెన్నూరు పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.సుధాకర్‌కు ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన గురువారం ఏఎస్ఐగా చెన్నూరులో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఆయనకు అభినందనలు తెలిపారు.

నగర శివార్లలో పోలీసుల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

కడప (క్రైం), జూలై 26 : ఎస్పీ ఆదేశాల మేరకు కడప నగర శివార్లలో స్పెషల్ డ్రైవ్ వారం రోజుల పాటు కొనసాగించనున్నారు. బ్లూకోల్ట్స్ స్పెషల్ పార్టీ సిబ్బంది సుమారు 50 మందితో ముమ్మరం గా వాహనాల తనిఖీ లు, నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లో కడప చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి సీకేదిన్నె సీఐ శంకర్‌నాయక్, కమాండ్ కంట్రోల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బందితో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రిపూట అనవసరంగా తిరిగే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదల నివాసిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 26 :పేదలు నివాసమున్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, లేదంటే ఆందోళన తప్పదని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో సీపీఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు నివాసం ఉంటున్న కాలనీలు అనేకం నగరంలో ఉన్నాయన్నారు. అక్కడ తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.

'డిప్యూటీ తహసీల్దారుపై విచారణ జరిపించాలి'

కడప (నాగరాజుపేట), జూలై 26 : దళిత భూములను అగ్రవర్ణాల వారికి కట్టబెట్టిన వల్లూరు మండలం డిప్యూటీ తహసీల్దారు సుహాసినిపై విచారణ జరిపించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని దళిత ఫోరం జిల్లా ఛైర్మన్ పూసపాటి కిశోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని దళిత ఫోరం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లూరు మండలం అంబవరం గ్రామంలో దళితులకు కేటాయించిన భూమి సర్వే నెంబరు 1140-1లో 25 సెంట్ల చొప్పున ప్రభుత్వం దళితులకు 1982లో కేటాయించిందన్నారు. డీకేటీ నెంబరు 495/85 డి.ఏసన్న ప్రకాశం సాగు చేస్తున్నారన్నారు. అలాగే వల్లూరు ఏపీజీబీ ద్వారా లోను తీసున్నారన్నారు. బ్యాంకు వారు పేరు ఆన్‌లైన్‌లో ఉంటేనే కదా లోన్ ఇస్తారన్నారు. కానీ డిప్యూటీ తహసీల్దారు సుహాసిని ఆన్‌లైన్ నిలిపివేస్తూ రికార్డులు తారు మారు చేసిందన్నారు. డిప్యూటీ తహసీల్దారుపై విచారణ జరిపించి న్యాయం చేయాలన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

పులివెందుల రూరల్, జూలై 26: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య ప్రజలను కోరారు. శుక్రవారం తొండూరు మండలంలోని బోడివారిపల్లెలో డాక్టర్ ఆరిఫుల్లా ఆదేశానుసారం ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వ్యాప్తికి కారణమయ్యే అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడువాపు, బోదకాలు లాంటి వ్యాధులు వస్తాయన్నారు. కావున దోమల నివారణ అందరి బాధ్యత అన్నారు. ఆరోగ్య కార్యకర్త మంజుల, వీరాంజనేయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వసతిగృహాల్లోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 :రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం ప్రకాశ్‌నగర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతిగృహం విద్యార్థులతో కలిసి వారి సమస్యలపై మాట్లాడారు.

శాకాంబరీ అలంకారంలో రాజరాజేశ్వరీదేవి

కడప (కల్చరల్), జూలై 26: రాజరాజేశ్వరీదేవి శుక్రవారం శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి సేవలో తరించారు.

వరుణదేవుడా.. కరుణించు

● ఊరిస్తున్న మేఘాలు... అడుగంటిన భూగర్భజలాలు ● కరువు కోరల్లో చక్రాయపేట మండలం



పదును లేక పైరుపెట్టని పొలం.. వానలేక బీళ్లుగా మారిన ఆయకట్టు భూములు(ఇన్‌సెట్) ఊరిస్తున్న మేఘాలు

చక్రాయపేట, జూలై 26: వరుణదేవుడ నీకు దండం.. కరుణించవయ్యా అంటూ చక్రాయపేట మండల ప్రజలు వేడుకుంటున్నారు. 20 రోజులుగా భారీ వర్షాలు కురిసేలా మేఘాలు కమ్ముకొంటున్నాయి తప్ప చుక్క చినుకు పడింటే ఒట్టే. ఫలితంగా వ్యవసాయ భూములు బీళ్లుగా మారిపోయాయి. చెరువులు, కుంటలు నోళ్లు తెరిచాయి. దుక్కులు చేసిన పొలాలు పంట కోసం ఎదురుచూస్తున్నాయి. ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. దీంతో మండలాన్ని కరువు కాటేస్తోంది. గత ఏడాది కూడా వర్షాలు సక్రమంగా పడక భూగర్భజలాలు అడుగంటి మామిడి, నిమ్మ ఎండిపోయాయి. ఈ ఏడాది వర్షాకాలంలో కూడా ఇంతవరకు పదును పడలేదంటే కరువు కమ్మేస్తోందని చెప్పవచ్చు. వర్షాలు కురిస్తే వరినాట్లు వేయాలని నారు పోసి వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మండలంలో పాపాఘ్నినదీ తీరప్రాంతంలో వరి సాగు చేశారు. మిగిలిన 75 శాతం ప్రాంతాలలో వరినాట్లు వేయలేదు. ప్రతిఏటా మండలంలో వేరుశనగ పంట భారీస్థాయిలో వేసేవారు. ప్రస్తుతం ఆ పంటలు కూడా వేయలేదు.వానకోసం ఎదురుచూస్తున్నారు.

సన్ననిమ్మ చెట్లు ఎండిపోయాయి



గతేడాది వర్షాలు రాక సన్న నిమ్మ చెట్లు ఎండిపోవడంతో రెండు ఆ వులు పెట్టుకొని 20 సెంట్లలో గడ్డివేసుకొని పాడితో జీవిస్తున్నాం. నాకు మూడు ఎకరాల భూమి ఉంది. గతంలో వర్షాలు బాగా కురుస్తుండటంతో సమృద్ధిగా నీరు ఉండేది. గతేడాది వర్షాలు రాక బోర్లు ఎండిపోయాయి. ఈ ఏడాది కూడా వర్షం వచ్చినట్లే ఉంది కాని చినుకుపడలేదు.

– ఓబులేసు, ఓబులనాయునిపల్లె, చక్రాయపేట మండలం

పత్తిలో తెల్లదోమను నివారించాలి

సీకేదిన్నె, జూలై 26: పత్తిపంటలో తెల్లదోమ, మెగ్నీషియం లోపాలను నివారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజేశ్వర్‌రావు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లికి చెందిన రైతు లక్ష్మీరెడ్డి పత్తిపంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో తెల్లదోమ, మెగ్నీషియం లోపాలను గుర్తించారని, నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాలన్నారు.

పత్తిపంటలో యాజమాన్య చర్యలు చేపట్టండి

లింగాల, జూలై 26: ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తిపంటలో యాజమాన్య చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. మండలంలోని రామాపురం గ్రామంలో పత్తిపంటను ఆయన పరిశీలించారు. రసంపీల్చే తామర పురుగుఉధృతి, పేనుబంక ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తామర పురుగు రసంపీల్చేయడం వల్ల ఆకుముడత వస్తుందన్నారు. దీని నివారణకు వేపనూనె 1500పీపీఎంలో 5ఎంఎల్ లీటర్ నీటికిలేదా ఫిప్రోనిల్ 2ఎంఎల్ లీటర్ నీటికి లేదా తాయోమతక్సన్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే పేనుబంక ఉధృతి ఉంటే 5శాతం వేపకషాయాన్ని లేదా ఫిప్రోనిల్ 2ఎంఎల్ లీటర్ నీటికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25ఎంఎల్ లీటర్‌నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే గులాబీ రంగుపురుగు ముందుజాగ్రత్త చర్యగా పత్తిపంటలో ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు అమర్చడం ద్వారా మగపురుగును ఆకర్షించి తదుపరి సంతతిని నివారించవచ్చన్నారు. గులాబీ రంగు పురుగు ఉధృతి గమనించినట్లయితే లీటర్ నీటికి 5ఎంఎల్ వేపనూనెను లేదా ప్రొఫైనోఫోస్ 2ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవకేంద్రం ఇన్‌చార్జి హరితకుమారి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే కందిపప్పు విక్రయించాలి

కడప (నాగరాజుపేట), జూలై 26: ప్రభుత్వ ధరలకే కందిపప్పు విక్రయించాలని సివిల్ సప్లై జిల్లా మేనేజరు అర్జున్ రావు, తూనికలు కొలతలు శాఖ జిల్లా ఇన్స్‌పెక్టర్ ఎంవీ రమేశ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పలు మార్కెట్లను తనిఖీ చేశారు. నగరంలోని మోర్ మార్కెట్లో బియ్యం, కందిపప్పు నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని సూచించారు.

సైనికుల ప్రాణత్యాగం వెలకట్టలేనిది

కడప (మారుతీనగర్), జూలై 26: కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన మనదేశ వీర సైనికుల సేవలు వెలకట్టలేనివని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ కొనియాడారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్ట్స్ కళాశాలలో కార్గిల్ విజయ్‌దివస్

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 : కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్‌దివస్ ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉగ్రవాద ముసుగులో కాశ్మీర్‌ను కబళించేందుకు చేసిన కుటిల యత్నాలను ఎదుర్కొని భారత సైన్యం సాధించిన విజయాన్ని కార్గిల్ విజయ్‌దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు.

వైవీయూను తనిఖీ చేసిన రిజిస్ట్రార్

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 : వైవీయూలో శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి పలు విభాగాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాన్స్‌పోర్టు విభాగానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. అతిథి గృహాలు, ఇంజనీరింగ్ విభాగాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పరిపాలన విభాగంలో గల లీగల్ సెల్‌తో సమీక్షించారు. ఉన్నత విద్యా మండలి అధికారులు ఆగస్టు మొదటి వారంలో విశ్వవిద్యాలయంలో నెలకొన్న న్యాయపర అంశాల పట్ల సమీక్ష నిర్వహిస్తారని, సెల్ డైరెక్టరు జయంత్‌తో చర్చలు జరిపారు.

'ఉద్యోగులను తొలగించడం అన్యాయం'

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 26 : సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేస్తున్న మగవారిని తొలగించాలనే విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ ఆప్కోస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగస్థులను తొలగించాలనే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రవిప్రకాశ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం తమ కార్యాలయంలో వారు విలేకుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన ఈ సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, రిమ్స్ నాయకులు పవన్, దస్తగిరి పాల్గొని మద్దతు పలికారు.

పూజా స్కూలును ఆర్సీఎంకు అప్పగించాలి

● ఏఐఎస్‌బీ జయవర్ధన్

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 : ప్రొద్దుటూరులో గల డాడీ హోం అధినేత దివంగత ఫాదర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న పూజా ఇంటర్నేషనల్ స్కూలును ఆర్సీఎంకు అప్పగించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూజా ఇంటర్నేషనల్ స్కూలు ఆస్తులన్నీ కబ్జా చేసేందుకు కొంత మంది అక్కడ పనిచేసే సిబ్బందిని బయటికి పంపే కుట్ర చేస్తున్నారన్నారు. తక్షణం ఆ పాఠశాలను రోమన్‌కేథలిక్ మిషన్ వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణ అందరి బాధ్యత

కడప(కలెక్టరేట్),జూలై 26: దోమలనివారణ అందరి బాధ్యత అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం తిలక్‌నగర్‌లో డ్రైడే- ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ వారానికి ఒక సారి ఇంటిలోని తొట్లు, కుండలు, బానలు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

'మాకు న్యాయం చేయండి'

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 : దేశానికి విశేష సేవలందించిన తన ఇంటి స్థలాన్ని తనకు అప్పగించి న్యాయం చేయాలని మాజీ సైనికుడు చెంద్రాయుడు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగరాజుపల్లె గ్రామం పొలం సర్వేనెం.158/1ఎ, 158/2లో 2.4 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందన్నారు. 1979లో తాను ఈ స్థలాన్ని కొనుగోలు చేశానన్నారు. ఆ స్థలానికి సంబంధించి పట్టా సైతం తన వద్దనే ఉందన్నారు. కోర్టు కూడా ఇంక్షజన్ ఆర్డరు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో బాధితుడి సతీమణి సుంకేసుల రావమ్మ, బీజేపీ నేత దుర్గం దస్తగిరి పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూ స్థలాన్ని పరిశీలించి ఇన్‌చార్జ్ వీసీ

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 :డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ శాశ్వత భవన నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం 110.36ఎకరాల భూమి కేటాయించింది. శుక్రవారం పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామ పరిధిలో సర్వే నెంబరు 17/1, 2 లో గల ఆ భూమిని ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ విశ్వనాథకుమార్ పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి యూనివర్సిటీకి కావాల్సిన నిధులు, శంకుస్థాపన తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

'అసత్య ఆరోపణలు తగదు'

కడప (మారుతీనగర్), జూలై 26: తనపై మాలమహానాడు రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇమ్మానియేల్, టి.వినోద్ కుమార్ అసత్య ఆరోపణలు చేయడం తగదని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ కె.అంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ వేదిక నాయకులు ఓబయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలి

వేంపల్లె, జూలై 26: ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియట్ బోర్డు డీవీఈఓ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. వేంపల్లె ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి తన సొంత డబ్బు రూ.35వేలు వెచ్చించి ఆ కళాశాలలో చదువుతున్న 125 మంది విద్యార్థినులకు ఉచితంగా యూనిఫాం సమకూర్చారు. డీవీఈఓ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు.

ఇద్దరు మట్కా బీటర్లు అరెస్టు

పులివెందుల టౌన్, జూలై 26: పట్టణంలోని మట్కా రాస్తున్న ఇద్దరు మట్కా బీటర్లు అరెస్టు చేసిన సీఐ మోహన్ తెలిపారు. ఇరువురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.18010 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పట్టణంలోని ఏడుమంది మట్కా నిర్వహించే వారిని పిలిచిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షాధార పంటలు బెట్ట తట్టుకునే చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె,జూలై 26: వర్షాధార పంటలు బెట్టను తట్టుకునే చర్యలు చేపట్టాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఉరుటూరు, గోనుమాకులపల్లె మినుము, వేరుశనగ పంటలను మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్ట పరిస్థితులు తట్టుకోవడానికి లీటరు నీటికి 20గ్రాముల యూరియా లేదా లీటర్ నీటికి 19:19:19 ఐదు గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు.

కొరవడిన పోస్టల్ ఆర్డర్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 26: గతంలో ఐదు, పది రూపాయలతో పోస్టల్ ఆర్డరు ద్వారా సమాచార హక్కు చట్టం సమాచారాన్ని తెలుసుకునేవాళ్లమని, ప్రస్తుతం వంద, యాభై రూపాయలు లేనిదే పోస్టల్ ఆర్డరు పొందలేకున్నామని ఆర్పీపీ కార్యదర్శివర్గ సభ్యుడు ప్రసాద్ పేర్కొన్నారు. తపాలా శాఖ వారు ప్రజా అవసరాన్ని మరిచినట్లున్నారన్నారు.

'డ్వామా పీడీపై విచారణ చేపట్టాలి'



పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ క్రిష్ణతేజకు వినతిపత్రం అందిస్తున్న పీరయ్య

కడప(ఎడ్యుకేషన్), జూలై 26 : కడప డ్వామాలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ మాజీ కౌన్సిల్ సభ్యుడు పీరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ క్రిష్ణతేజకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్వామా పీడీగా విధులు నిర్వహించిన యదుభూషణ్‌రెడ్డి తన పదవీ కాలం ముగిసినా తిరిగి రెండు సంవత్సరాలు ఎక్స్‌టెన్షన్ చేసుకుని ఉపాధి హామీలో అవినీతికి పాల్పడ్డారన్నారు. అతని పదవీ కాలంలో 30 మందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలలో చేర్చుకుని ఆ ఉద్యోగుల ద్వారా జేబులు నింపుకున్నార న్నారు. ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి రెండు చోట్ల పోస్టింగ్‌లు ఇచ్చారని, వరలక్ష్మి అనే ఉద్యోగి అసిస్టెంటు విజిలెన్స్ ఆఫీసరు, కంప్యూటరు ఆపరేటరుగా పనిచేస్తోందన్నారు. ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఏపీఓగా ఇవ్వవచ్చా, ఒకవేళ ఇస్తే సీనియారిటీ పాటించరా అని ప్రశ్నించారు. తక్షణం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో ఇన్‌చార్జ్ వీసీ ఆకస్మిక తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 : కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో వసతిగృహం త్రీడీ ల్యాబ్‌ను ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం అందుతున్న స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్ర వాతావరణంలో వంట చే యాలన్నారు. వంట చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వంటశాల, స్టోర్‌రూము తదితర గదులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి, హాస్టలు వార్డెన్ విద్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు స్పందన



జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న జగదీష్‌బాబు

పులివెందుల, జూలై 26: పట్టణంలో నిర్వహించిన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జనసేన నాయకుడు జగదీష్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక రాజీవ్ డిష్ సమీపంలో వేముల, లింగాల మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జగదీష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈనెల 18వ తేదీన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రమాద బీమా ఐదు లక్షలతో పాటు, ఆరోగ్యరీత్యా రూ.50వేలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. జనసేన అధినేత పిలుపు మేరకు సభ్యత్వ నమోదుకు ప్రజలు అధికసంఖ్యలో వస్తున్నారన్నారు.మహేశ్వర్‌రెడ్డి, కుళాయప్ప, దానమయ్య, ప్రసాద్, చిన్న, శ్రీనివాస్‌రెడ్డి, సాయికిరణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో పరిశుభ్రత మెరుగుపరచాలి

పులివెందుల రూరల్,జూలై 26: ఆర్టీసీ బస్సుల్లో పరిశుభ్రతను మెరుగుపరచాలని డీఎం రామకృష్ణను ప్రయాణికులు కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో సమస్యలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పులివెందుల నుంచి కర్నూల్‌కు వయా తాడిపత్రి మీదుగా, వేంపల్లె మీదుగా ఇడుపులపాయ వరకు, సింహాద్రిపురం నుంచి ముదిగుబ్బకు బస్సులను పునరుద్ధరించాలని కోరారు. ముదిగుబ్బ మీదుగా ధర్మవరానికి, ముదిగుబ్బ, ములకలచెరువు, చింతామణి మీదుగా బెంగుళూరుకు సర్వీస్ నడపాలని కోరారు. పులివెందుల పట్టణంలో బస్సులన్నీ ఒకేరూట్‌లో వచ్చిపోయేలా చర్యలు తీసుకోవాలని, మడకశిర నుంచి విజయవాడకు వెళ్లే బస్సుకు తొండూరులో స్టేజీ ఇవ్వాలన్నారు. అలాగే కడప నుంచి పులివెందులకు వచ్చినపుడు పులివెందుల పాత బస్టాండ్, పులివెందుల కొత్త బస్టాండ్‌కు టికెట్ ధర ఒకేలా ఉండేలా చూడాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని డీఎం రామకృష్ణ ప్రయాణికులకు తెలిపారు.

పీఆర్‌టీయూలో పలువురు చేరిక



పీఆర్‌టీయూలో చేరిన సీకేదిన్నె నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 : పీఆర్‌టీయూలో సీకేదిన్నె మండల సీనియర్ నాయకులు ఎంవీ క్రిష్ణప్రసాద్, కె.రామాంజనేయరెడ్డి పీఆర్‌టీయూలో చేరారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, జిల్లా అధ్యక్షుడు బండి విశ్వనాథరెడ్డి, కార్యదర్శులు మోపూరి వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో పీఆర్‌టీయూలో చేరారు. వీరికి పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టాక్రిష్ణయ్య, గిరిప్రసాద్‌రెడ్డి, ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు స్వాగతం పలికారు.

రాష్ట్రానికి అధిక నిధులు రావడం శుభసూచకం: టీఎన్ఎస్ఎఫ్

కడప (ఎడ్యుకేషన్), జూలై 26 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడం శుభసూచకమని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ తెలిపారు. శుక్రవారం టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పాలనలో అధోగతిపాలైన రాష్ట్రాన్ని చంద్రబాబు పునర్నిర్మాణం చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వడం చంద్రబాబు సాధించిన విజయమని తెలిపారు. ప్రధానంగా వెనుకబడిన జిల్లాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర కోసం ప్రత్యేక నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు లోకేశ్, శ్రీవాణి, ఫరీద్, గణేశ్, శ్రీను పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

కమలాపురం రూరల్, జూలై 26 : ప్రజలందరూ ప్రతిశుక్రవారం డ్రైడే పాటించాలని పెద్దచెప్పలి పీహెచ్‌సీ డాక్టర్ జావలి ప్రసూన తెలిపారు. శుక్రవారం పెద్దచెప్పలి పీహెచ్‌సీ కేంద్రం నందు డెంగ్యూ నివారణ వారోత్సవాలు సందర్భం గా సమావేశం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద్దచెప్పలిలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలు తమ ఇంటి ఆవరణంలో ఖాళీ కుండలను, ఇంట్ల ఉన్న నీళ్ల బానలు, తొట్లను కడిగి ఆరబెట్టాలన్నారు. దీనినే డ్రైడేగా పిలుస్తారన్నారు. కార్యక్రమంలో సబ్యూడు అధికారి ఎంవీ ప్రసాద్, సూపర్‌వైజరు విజయకుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఉల్లితోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



బూచుపల్లె గ్రామంలో ఉల్లిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పులివెందుల టౌన్,జూలై 26: తొండూరు మండలంలోని బూచుపల్లె, భద్రంపల్లె గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి ప్రధాన శాస్త్రవేత్త ఠాగూర్‌నాయక్ జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి ఉల్లిపంటను శుక్రవారం పరిశీలించారు. రైతులు మడులు చేసుకొని ఉల్లి పంట ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి, తొండూరు వ్యవసాయాధికారి మధుసూధనరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె, జూలై 26: వేంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ అసిస్టెంట్ జిల్లా డైరెక్టర్ ఆజాద్ రైతులకు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా పక్కన ఉన్న రైతు బజార్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆజాద్ మాట్లాడుతూ రూ.1.20కోట్ల వ్యయంతో రైతు బజార్‌ను నిర్మించారని, ఐదు మండలాలకు కేంద్రంగా ఉందని, ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పూడిక తొలగేనా.. మురుగు పారేనా..!

● పూడికతో పేరుకుపోయిన మైలవరం దక్షిణ కాలువ ● ముందుకు సాగని మురికి నీరు ● చీకటి అయితే దోమల విజృంభణ
● పట్టించుకోని పంచాయతీ అధికారులు ● పూడిక తీయాలని కోరుతున్న ప్రజలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: మండలంలో పంట పొలాలకు సాగునీరు అందించడానికి మైలవరం దక్షిణ కాలువ నిర్మించారు. సాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రస్తుతం ఆ కాలువ మురుగు కాలువగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైలవరం దక్షిణ కాలువ మండలంలోని బొల్లవరం సత్రం వద్ద నుంచి ప్రారంభమై లింగారెడ్డికొట్టాలు, శ్రీనివాసనగర్, ద్వారకానగర్, ఆచార్య కాలనీ, గంగిరెడ్డుల కాలనీ మీదుగా అమృతానగర్‌వరకు మూడున్న కిలోమీటర్లు విస్తరించింది. గోపవరం పంచాయతీలోనే ఈ కాలువ ఎక్కువ భాగం ప్రవహిస్తోంది. ఇళ్ల, వీధుల నుంచి వచ్చే మురుగునీరు, చెత్తాచెదారం కాలువలో పేరుకుపోయింది. ఇళ్ల యజమానులు కాలువపై బండలు పరచడంతో పూడిక తీసే మార్గం లేకుండాపోయింది. దీంతో చాలా కాలంగా పూడిక తీసే విషయాన్ని గోపవరం పంచాయతీ అధికారులు మరచిపోయారు. పూడిక పేరుకుపోయి మురుగునీరు ముందుకు సాగక దుర్వాసనతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. చీకటి పడితే చాలు దోమల దాడి మొదలవుతుంది. దోమల దెబ్బకు రోడ్లపై ఉండలేని పరిస్థితి. కాలువ వెంట ఉన్న ప్రజలు దోమల బాధ పడలేకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో కాలువలో పూడిక తొలగించాలని అక్కడి ప్రజలు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరు. కాలువ నిర్మించి చాలా కాలం కావడంతో శిథిలావస్థకు చేరి దుమ్ము, ధూళి కాలువలోకి చేరుతోంది. దోమల మందు పిచికారీ చేయమని కోరినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో దోమల బెడద భరించలేమని పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులకు పన్నులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంపై లేదని విమర్శిస్తున్నారు. కాలువలో పూడిక తొలగించి దోమల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


పూడికతో నిండిన కాలువ

పూడిక తొలగించాలి



కాలువలో పూడిక తీయక కొన్ని సంవత్సరాలు అవుతోంది. దోమలు, దుర్వాసన, విషజ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలువలో పూడిక తీయడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

నాగరాజుఆచారి, స్థానికుడు

ఆక్రమణలు తొలగించాలి



కాలువపై ఆక్రమణల వలన పూడిక తొలగించడానికి ఇబ్బందిగా మారింది. ఆక్రమణలు తొలగించి పూడిక తీసి మురుగునీరు పారేలా చేయాలి. తరచుగా కాలువలో దోమల మందు పిచికారీ చేయాలి.

కుళాయిరెడ్డి, స్థానికుడు


కాలువలో మొలిచిన జంబు

15న ప్రొద్దుటూరులో అన్నా క్యాంటీన్ ప్రారంభం


అన్నా క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 26 : ప్రొద్దుటూరులో గతంలో వున్న చోటనే అన్నా క్యాంటీన్‌ను ఆగస్టు 15 ప్రారంభిస్తారని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం టీబీ కాంప్లెక్స్ పక్కన ఉన్న పాత అన్నాక్యాంటీన్ భవనానికి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. 7.5 లక్షల రూపాయలతో చేపట్టిన ఈ పనులను ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, కమిషనర్ రఘునాథరెడ్డి, ఈఈ సాయిక్రిష్ణ పరిశీలించారు. క్యాంటీన్ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డికి సూచించారు. పెయింటింగ్ ఫర్నీచర్ ఇతర పనులు అన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

'వేలం డబ్బులు కట్టకుండా ఉండేందుకు వైసీపీ డ్రామాలు'

మైలవరం, జూలై 26 : పెద్ద కొమెర్ల గ్రామంలో చెన్నకేశవస్వామి, ఈశ్వరస్వామి ఆలయాల 70 ఎకరాల భూమికి వేలం డబ్బులు కట్టకుండా ఉండేందుకు వైసీపీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని గ్రామ టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అనుకూల పత్రికలో దేవదాయ భూముల వేలంలో టీడీపీ నాయకులపై సర్పంచ్ రామసుబ్బమ్మ అసత్య ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో జరిగిన వేలం పాటలో పాల్గొనకుండా టీడీపీ నాయకులను ఏం చేశారో గ్రామ ప్రజలందరికీ తెలుసన్నారు. గత ఏడాదికి సంబంధించి వైసీపీ నాయకులు లక్షా 20 వేలకు పైగా దేవదాయ భూముల డబ్బులు కట్టాలని అయితే ఆ డబ్బులు కట్టకుండా ఎగ్గొట్టాలని వైసీపీ గ్రామ సర్పంచ్ రామసుబ్బమ్మ, టీడీపీ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

మూడో రోజుకు చేరుకున్న నిరసన



ముద్దనూరు జూలై26:మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు శుక్రవారానికి మూడో రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ వద్ద నిరసన చేపట్టి మూడు రోజులవుతున్నా అధికారులు, యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందనాలేదన్నారు. ఫ్యాక్టరీ మూతవేసేంత వరకు నిరసన కార్యక్రమం ఆపేదిలేదన్నారు.

నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని టీడీపీ బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పీఎస్ఎస్ సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి బీసీ సామాజిక వర్గం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిందని, ఇటీవల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారని తెలిపారు. అనంతరం ఆయనకు వినతి పత్రం అందజేశారు.

మునిసిపల్ మంత్రి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఆసం


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో ఆసం రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 26 : రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణను ప్రొద్దుటూరు మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి కలిశారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి నారాయణను గౌరవార్థం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసిశాలువతో సన్మానించారు. ఆసం రఘురామిరెడ్డి వెంట టీడీపీ యువనేత ఆర్‌వీ చలపతి తదితరులు ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చని రక్తదానం పుణ్యకార్యమని డీఎస్పీ మురళీధర్ పేర్కొన్నారు. శుక్రవారం టీటీడీ కల్యాణమండపంలో నెహ్రూ యువకేంద్రం వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా విభజన విభాగం అధికారి మణికంఠ, టీటీడీ మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి, ప్రసాద్, విజయకుమార్, అశోక్, సురేంద్ర, నెల్సన్ తదితరులు పాల్గొన్నారు.

వాసవాంబకు గోరింటాకు అలంకారం

ఎర్రగుంట్ల జూలై 26:ఎర్రగుంట్ల నగర పంచాయతీలోని అమ్మవారిశాలలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి గోరింటాకు అలంకారం నిర్వహించారు. అలాగే ఏరువాక ఆలయంలో అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉద్యోగులకు బదిలీలు తప్పవు

ఖాజీపేట, జూలై 26: ఉద్యోగులకు ఎవరికైనా బదిలీ తప్పదని తహసీల్దారు వి. వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ వెళుతున్న తహసీల్దారును సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు తప్పవన్నారు. అనంతరం అక్కడే పనిచేస్తున్న డీటీ రవికి ఇన్‌చార్జి తహసీల్దారు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

31న పాలిసెట్ అడ్మిషన్లు

జమ్మలమడుగు, జూలై 26: జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31వ తేదీన పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ ద్వారా పాలిటెక్నిక్‌లో సీటు పొందవచ్చని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తుతోపాటు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జతపరచి కళాశాలలో సమర్పించాలని ఆయన తెలిపారు. సీటు పొందినవారు రూ.5,800 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

బద్వేలు, జూలై 26: ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని బిజివేమువీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కళాశాలలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథక సన్వయకర్తలు డాక్టర్ దొర స్వామి నాయక్, సి.హెచ్.ఈశ్వరయ్య, మహేశ్, వలంటీర్లు , విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కారు, బైకు ఢీ : ఇద్దరికి గాయాలు

ఖాజీపేట, జూలై 26: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు సమీపంలో కారు స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు చెముళ్లపల్లె గ్రామానికి చెందిన పెద్దపెంచలయ్య, నాగదాసరి రాణి ఇద్దరు మైదుకూరుకు వెళుతుండగా పత్తూరు సమీపంలోకి రాగానే కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఢీకొన్న వాహనం ఆపకుండా వెళ్లిపోవడంతో వాహనం కోసం పోలీసులు తనిఖీలు చేస్తున్నారు.

అర్థవంతమైన బోధనచేయాలి:ఎంఈవో

కాశినాయన జూలై26: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థవంతమైన బోధనచేయాలని ఎంఈవో-2 ఓ.నిర్మల పేర్కొన్నారు. విద్యావారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మిద్దెల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాలు, మధ్యాహ్నభోజన నాణ్యత దానికి సంబంధించిన రికార్డులు,రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీవారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో సీఆర్పీ రవి పాల్గొన్నారు.

శాకాంబరీదేవి అలంకారం



మైదుకూరు రూరల్ జూలై 26 : మైదుకూరు పట్టణంలో వెలసిన శ్రీమాధవరాయస్వామి ఆలయం లో ఆషాఢ మాసం శుక్రవారం కావడంతో పార్వతిదేవి విగ్రహాన్ని శాకాంబరీదేవి అలంకారంలో భక్తులు అలంకరించారు.స్థానిక మహిళలు అమ్మవారికి చీర సారెలతో ఒడి బియ్యం పోశారు.అమ్మవారిని భక్తులు విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పట్టణంలో బీసీ భవనం ఏర్పాటు చేయాలి

బద్వేలు, జూలై 26: జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు నేటికీ సమాశాలు నిర్వహించుకునేందుకు బద్వేలు పట్టణంలో బీసీ భవనం లేదని వెంటనే ఏర్పాటు చేయాలని పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ గురుమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఓ ప్రైవేటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో బీసీ భవనం లేని కారణంగా వారు సమావేశాలు,చిన్న,చిన్న శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలచెన్నయ్య , బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్, యంకేబీఎన్ఆర్. సాగర్, అఖిల భారతీయ మరాఠా పరిషత్ జాతీయ అధ్యక్షుడు కత్తి బ్రహ్మయ్య, పద్మశాలి సంఘం నాయకుడు శింగరయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు రామసుబ్బయ్య, రామయ్య, వెంకటరమణ , బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం

అట్లూరు, జూలై 26 : పోష్ 2013 చట్టంపై శుక్రవారం అట్లూరు స్త్రీశక్తి భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐసీడీసీ సీడీపీవో శ్రీదేవి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ కోసం పోష్ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేసిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమానుల్లా, ఎంఈవో విలియం రాజు, వైద్యాధికారి హమీదాబేగం, ఏవో, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బి.కోడూరు..:పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో భాస్కర్‌రావు అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీ పీవో శ్రీదేవి, విద్యాశాఖ అధికారి సురేశ్ మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక వేధింపులు మానుకోవాలని, కార్మిక స్త్రీలపై, ఒంటరి మహిళలపైన అఘాయిత్యాలు మానుకుని జీవనం సాఫీగా సాగించాలని వారు అన్నారు. లేనిపక్షంలో పోష్ యాక్ట్ 2013 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అన్నిశాఖల అధికారులు, సెక్రటరీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

స్కీంవర్కర్లు, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

పోరుమామిళ్ల, జూలై 26 : స్కీంవర్కర్లు, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ, ఆశా మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయవత్తిడి తీసుకురావద్దన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్, దస్తగిరమ్మ, బొజ్జ చిన్నయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

అట్లూరు, జూలై 26 : మండలంలోని గ్రామ పంచాయతీల్లో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం పనులు చేపట్టాలని డీపీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం నందు సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్త వహించి వీధుల వెంబడి మురుగునీరు చేరకుండా శానిటేషన్ చేయాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రమణారెడ్డి, ఏవోభాస్కర్‌బాబు, అట్లూరు సర్పంచ్ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జోరుగా సుద్దమట్టి తరలింపు

జమ్మలమడుగు, జూలై 26: జమ్మలమడుగులో గండికోట రోడ్డు నుంచి ప్రతిరోజు రాత్రి సమయాల్లో టిప్పర్లలో గ్రావెల్ సుద్దమట్టి తరలిపోతోంది. ఇటీవల పది రోజుల క్రితం పగలు, రాత్రి సుద్దమట్టి (ఎర్రమట్టి గ్రావెల్) బయటి ప్రాంతాలకు తరలిపోతోంది. జమ్మలమడుగులో ఇసుక, మట్టి భారీగా తరలిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలున్నాయి. ఈ సమస్యకు సంబంధించి జమ్మలమడుగు తహసీల్దారు కరుణాకర్‌ను 'ఆంధ్రజ్యోతి' సమస్యను తెలిపి వివరణ కోరగా తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

గోపవరం, జూలై 26 : ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ముందు సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా, నిరసన నిర్వహించారు. జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కబ్జాలకు గురైన భూములలో రెవెన్యూ అధికారులు వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, బాలు, రమణ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: విద్యార్థులు మానద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ మురళీధర్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాలలో సైబర్ సెక్యూరిటీ డ్రగ్ అడిషన్ యాంటీ ర్యాగింగ్, రోడ్‌సేఫ్టీ అన్న అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినులు లైంగిక వేధింపులు, సైబర్ క్రైం బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్‌సెల్ అధికారి జీవన్‌రెడ్డి , రూరల్ సీఐ రమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ జ్యోతి, వైద్యుడు పాండురంగారెడ్డి, గాయత్రి, సుబ్బారెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న తహసీల్దారుకు సన్మానం

రాజుపాలెం, జూలై 26 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సేవలందించిన తహసీల్దారు విజయశ్రీకి సోమవారం రాజుపాలెం మండల కార్యాలయంలో డీటీ మనోహరరెడ్డి ఆధ్వర్యంలో వీఆర్వోలు తదితరులు పూలమాలలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన మళ్లీ తమ సొంత మండలానికే వెళుతున్నట్లు విజయశ్రీ తెలిపారు. ఇక్కడున్న సిబ్బంది సార్వత్రిక ఎన్నికల్లో అన్నివిధాలుగా సహకరించినందుకు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి చీరె,సారెతో పోటెత్తిన భక్తులు

ప్రొద్దుటూరు జూలై 26 : పవిత్ర ఆషాడమాసంలో చౌడేశ్వరి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం వేంకటేశ్వర్లపేటలోని చౌడేశ్వరి అమ్మవారికి చీరె,సారె కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున చీరె,సారెను అమ్మవారికి తెచ్చి సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అమ్మవారికి కాయా కర్పూరం సమర్పించి ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు, దండే ప్రసాద్, రంగనాయకులు. రాముడు, అంజి, నరసింహులు, మంత్రం స్వామి, సురేష్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో శుక్రవారం చౌడేశ్వరీదేవి అమ్మవారికి చీరె, సారె కార్యక్రమం నిర్వహించారు. నాగులకట్టవీదిలో చౌడేశ్వరీదేవి అమ్మవారికి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళా భక్తులు చీరె, సారె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, తదితర పూజా సామగ్రితో ఊరేగింపుగా భక్తులు చెక్కభజనతో అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. వర్షం కురిసి రైతులకు పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గంజికుంట తిరుమలదాసు, తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో చీరె,సారెతో అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26: ఎస్వీ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా విద్యార్థులు జాతీయ పతాకంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీని కరస్పాండెంట్ హరినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల త్యాగాలను గుర్తించుకోవాలన్నారు. విద్యార్థులు కళాశాల వద్ద నుంచి గాంధీరోడ్డు, టీబీరోడ్డు, రాజీవ్ సర్కిల్ మీదుగా జైజవాన్, జైకిసాన్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, ఏవోసలీం, ప్రిన్సిపాల్ ముస్తఫా, అధ్యాపకులుపాల్గొన్నారు.

బద్వేలు..: అమరవీరుల ప్రాణత్యాగాలు వెలకట్టలేనివని నాగభూణం కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని నాగభూషణం కళాశాల ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌వింగ్, ఏఎన్ఓ విద్యార్థులచే కార్గిల్ యుద్ధ జవాన్ల త్యాగాలను గుర్తుచేసుకుంటూ కళాశాల ఆవరణ నుంచి పోరుమామిళ్లలోని అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యకమంలో కళాశాల కరస్పాండెంట్ సాయిక్రిష్ణ, ఓబులేసు, ఎన్‌సీసీ ఆర్మీ, నేవీ, ఏయిర్‌వింగ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లకావస్తున్న సందర్భంగా పోరుమామిళ్లలో మాజీ ఆర్మీ సైనికులు పట్టణంలో మోటారు బైకు ర్యాలీ నిర్వహించి సమావేశం నిర్వహించారు.ముందుగా స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ఎస్టీకాలనీ సమీపంలో ఉన్న మాజీ సైనికుల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్గిల్ విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌సీసీ చైర్మన్ జగన్ రెడ్డి,బీఎస్ఎస్‌బీ ఆఫీసర్ రఘురామయ్య, వీసీహెచ్ఎస్ ఓసీ అబ్రహం, రాముడు, వెంకటయ్య పాల్గొన్నారు.




ప్రొద్దుటూరులో జాతీయ జెండాను ఊరేగిస్తున్న దృశ్యం, పోరుమామిళ్లలో మోటారు బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్మీ మాజీ సైనికులు